
మాటల్లో మిన్న.. చేతల్లో సున్నా

గ్రాండ్ సాక్షి రిపోర్ట్



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని చోట్లా కొత్త రహదారులు నిర్మిస్తామని గత ఎన్నికల్లో కూటమి నేతలు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ప్రకటించిన సంగతి తెలిసిందే. మొదట్లో సంక్రాంతికి నూతనంగా రోడ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేకపోవడంతో.. ఆ తర్వాత ఉగాదికి కొత్త రోడ్లు వేస్తామని రాష్ట్ర వ్యాప్తంగా ఊదరగొట్టారు. దీంతో తూర్పు నియోజకవర్గ ప్రజలు కొత్త రోడ్లు వస్తాయనుకొని ఎంతో ఆశపడ్డారు. ఉగాది కూడా దాటిపోయినా.. ఇంతవరకు నియోజకవర్గంలో ఎక్కడా కొత్తగా రోడ్లు నిర్మించలేదు సరికదా.. పలుచోట్ల కనీసం మరమ్మతులు కూడా చేపట్టకుండా వదిలేశారు. దీంతో ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారులను చక్కగా అభివృద్ధి చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ప్రజలు విమర్శిస్తున్నారు.

- అధికారంలోకి వస్తే రోడ్లు బాగుచేస్తామని కూటమి నేతల ప్రగల్భాలు
- పవర్ చేతికొచ్చాక పట్టించుకోని పాలకులు
- సంక్రాంతి, ఉగాది పండగలు దాటిపోయినా.. ప్రారంభం కాని రోడ్ల అభివృద్ధి పనులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ
- కూటమి ప్రభుత్వంలో కానరాని కొత్త రోడ్ల నిర్మాణం
- 'తూర్పు'లో శిథిల రహదారులకు మరమ్మతులు శూన్యం
- నరకప్రాయంగా ప్రజల ప్రయాణాలు

శిథిల రహదారులపై అవస్థల ప్రయాణం


రాజీవ్‌నగర్ - వెటర్నరీ కాలనీ రహదారిలో గోతులు

ఆరిలోవ: ఉగాది నాటికి అన్ని రోడ్లకు మరమ్మతులు చేసేస్తామని కూటమి నేతలు ప్రగ్భాలాలు పలికారు తప్ప.. పనులు ఎక్కడా చేయలేదు. తూర్పు నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో ప్రధాన రహదారులు శిథిలమయ్యాయి. రోడ్ల మధ్యలో గోతులు, రోడ్ల అంచుల కోతకు గురవడం, కొన్నిచోట్ల రాళ్లు పైకి తేలిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రహదారిలోని సర్వీస్ రోడ్డు మధ్య మధ్యలో శిథిలమైంది. దీనిపై కొన్నిచోట్ల రాళ్లు తేలాయి. మరికొన్ని చోట్ల గోతులు పడ్డాయి. దీంతో ఈ రహదారిపై వాహన చోదకులు అవస్థలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

వీధి రోడ్లు అంతే..

జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీఫారం, ఇందిరాగాంధీ నగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని వీధి రోడ్లు శిథిలావస్థకు చేరాయి. డెయిరీఫారం కూడలి నుంచి ఇందిరాగాంధీ నగర్ వెళ్లే రోడ్డు అంచులు సగానికి కోతకు గురయ్యాయి. రాజీవనగర్, వెటర్నరీ కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా గోతులు పడి దెబ్బతింది. ఆయా కాలనీల్లో వీధి రోడ్లది ఇదే పరిస్థితి. ఇక్కడి పనులకు గత ఏడాదిలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేసి వాటిని జరపకుండా వదిలేశారు.


పెదగదిలి, విమ్స్ మధ్యలో గోతులు పడి రాళ్లు తేలిన బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు


డెయిరీఫారం - ఇందిరాగాంధీ నగర్ మధ్యలో కోతకు గురై అంచుల శిథిలమైన రోడ్డు

హోం మంత్రి ఇలాకాలో అధ్వానంగా రహదారి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని రహదారి అధ్వానంగా మారింది. గాదిరాజు ప్యాలెస్ వెనుక భాగంలో ఎంవీపీ కాలనీ నుంచి లాసన్స్ బే కాలనీ వరకు ఉండే ఈ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీని మరమ్మతులపై జీవీఎంసీ దృష్టి సారించడం లేదు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత నివాసం ఈ రోడ్డులోనే ఉండటం గమనార్హం. రెండు నెలల కిందట ఆమె ఈ రహదారిలోని నివాసంలోకి మారారు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ఈ రోడ్డును బాగుచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. భారీ గుంతలతోపాటు వర్షం కురిసిన ప్రతిసారి ఈ రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు నిలిచిపోతుంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


ఎంవీపీ సెక్టార్-11లో భారీ గోతులతో అధ్వానంగా రహదారి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధి


సూర్యతేజనగర్ వద్ద గెడ్డపై నిర్మించిన బ్రిడ్జి, చినగదిలి వరకు డబుల్ రోడ్డు


పెదగదిలి వద్ద గెడ్డపై నిర్మించిన సువిశాల వంతెన రహదారి

ఆరిలోవ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని అనేక రోడ్లు అభివృద్ధి చెందాయి. ఆరిలోవ ప్రాంతంలోని గెడ్డలపై వంతెన రహదారులు నిర్మించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రధాన రహదారులతోపాటు వీధి రోడ్లకు సైతం కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేకపోతోందని స్థానికులు నుంచి విమర్శలు మూటకట్టుకుంటోంది. గత ప్రభుత్వంలో రూ.2.35 కోట్ల ఎంపీ నిధులతో బీఆర్‌టీఎస్ రహదారిలో చినగదిలి కూడలి(నార్త్ షిర్డీసాయిబాబా మందిర) నుంచి సూర్యతేజనగర్ వరకు 20 అడుగుల వెడల్పు గల రహదారిని 60 అడుగులతో డబుల్ రోడ్డు నిర్మించారు. రూ.2 కోట్లతో సూర్యతేజనగర్ వద్ద గెడ్డపై, సుమారు రూ 3.50 కోట్లతో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలోని గెడ్డపై 80 అడుగుల వెడల్పుతో వంతెన రహదారుల నిర్మాణాలు చేపట్టారు.


కేఆర్‌ఎం కాలనీ తెలుగుతల్లి జంక్షన్‌లో మరమ్మతులకు నోచుకోని రహదారి

రోడ్లు తవ్వారు.. మరమ్మతులు మరిచారు

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డులోని పలు రహదారులు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. భూగర్భ డ్రైనేజీ, పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్వేసిన రోడ్లకు నేటికీ మరమ్మతులు చేయలేదంటూ కేఆర్ ఎం కాలనీ గణేష్‌నగర్ వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడి రహదారుల గుండా రాకపోకలు చేయడానికి నానా అవస్థలు పడుతున్నామంటున్నారు. చినుక పడితే తవ్వి వదిలేసిన రోడ్లు కాస్త బురదమయంగా మారుతున్నాయి. కేఆర్‌ఎం కాలనీ 60 అడుగుల రోడ్డులోని తెలుగుతల్లి విగ్రహం జంక్షన్ వద్ద రహదారి పరిస్థితి ఘోరంగా ఉంది.


గణేష్‌నగర్‌లో గోతులతో నిండిన రోడ్డు

వాహన చోదకులకు చుక్కలు


20వ వార్డులోని డాక్టర్స్ కాలనీ రోడ్డు


రామ్‌నగర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి


కరకచెట్టు పోలమాంబ ఆలయం వద్ద గోతులతో రోడ్డు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20, 22, 28 వార్డుల్లోని రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. 20వ వార్డులోని డాక్టర్స్ కాలనీ, శివాజీపాలెం రోడ్లు గోతులతో నిండి వాహన చోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి. వాహనాలు నడిపేవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం జరగడం ఖాయం. ఈ ప్రాంతంలో కొందరు ప్రముఖులు నివసిస్తున్నా.. ఇక్కడి రోడ్లకు మోక్షం మాత్రం కలగడం లేదు. ఈ వార్డులో గత ఏడాది కాలంలో ఒక్క రోడ్డు నిర్మాణం జరగలేదు.

ఏడాదిలోనే గోతులు..

20వ వార్డు పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవాలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్‌కు వెళ్లే రహదారిని చాలా అందంగా.. ఆకర్షణీయంగా నిర్మించారు. ఏడాదిలోనే ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పాడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణానికి వాహన చోదకులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు.

22వ వార్డులో దారుణంగా..

వార్డులోని పిఠాపురం కాలనీ, రాజీవ్‌నగర్ రోడ్లు దారుణంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ గోతులు, రోడ్డుపై రాళ్లు తేలడంతో వాహన చోదకులకు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఇక్కడి రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు.

28వ వార్డులో గోతుల దారులు..

పాత జైల్ రోడ్డు నుంచి రామ్‌నగర్ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలోనే నగరానికి వచ్చే ప్రముఖులు ప్రయాణిస్తుంటారు. ఇక్కడి ప్రభుత్వ అతిథి గృహానికి వెళ్లే రోడ్డులో పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. వీవీపీలు ప్రయాణించే ఈ మార్గం ఏడాదిగా మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది.


శివాజీపాలెం రోడ్డుతో గోతులు

క్లుప్తంగా

ఫుట్‌పాత్‌పై చెత్త తొలగింపు


చెత్త తొలగించడంతో శుభ్రంగా ఫుట్‌పాత్

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: ఫుట్‌పాత్‌పై పది రోజులుగా పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదని శనివారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించారు. 20వ వార్డు పెదవాల్తేరు నుంచి చినవాల్తేరుకు వెళ్లే రహదారిలోని ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మాస్కుల పంపిణీ


స్థానికులకు మాస్కులు అందిస్తున్న కృష్ణా సేవా సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం: కరోనా వైరస్ నుంచి రక్షణ కోసం ఉచితంగా మాస్కులను శనివారం మద్దిలపాలెం, పిఠాపురం కాలనీలో పంపిణీ చేశారు. టీడీపీ విశాఖ జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ చేతుల మీదుగా స్థానికులకు వీటిని అందించారు. సేవా కార్యక్రమంలో భాగంగా మాస్కులు అందజేశామని, వీటిని ప్రతి ఒక్కరూ విధిగా ధరించాలని కృష్ణా సేవా సంఘం ప్రతినిధులు సూచించారు.

ఘనంగా రెప్కో బ్యాంక్ వార్షికోత్సవం


బ్రాంచ్ మేనేజర్ రవికుమార్‌ను అభినందిస్తున్న ఖాతాదారులు

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటైన రెప్కో బ్యాంక్ 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. రామాటాకీస్ ప్రాంతంలోని బ్యాంక్ బ్రాంచ్‌లో బ్రాంచ్ మేనేజర్ యల్లపు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలువురు ఖాతాదారులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి స్వీట్లు పంపిణీ చేశారు.

యువతి అదృశ్యం


మెరపా కావ్య

ఎంవీపీకాలనీ: ఓ డ్యాన్స్ అకాడమీలో పనిచేస్తున్న మెరపా కావ్య అనే యువతి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. హనుమంతవాక విజయదుర్గా కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి కావ్య నివసిస్తోంది. బీఎస్సీ నర్సింగ్ చేసిన ఈమె కొన్నాళ్లుగా ఎంవీపీ కాలనీ ఉషోదయ జంక్షన్‌లోని ఓ డ్యాన్స్ అకాడమీలో పనిచేస్తోంది. ఈ నెల 21న విధులకు వెళ్లిన కావ్య తిరిగి ఇంటికి రాలేదు. ఆఫీస్‌లో సంప్రదించగా.. రాత్రి 7.30 గంటలకు ఇంటికి వెళ్లిపోయినట్లు తెలిపారు. స్నేహితులు, బంధుమిత్రుల ఇళ్లలో కుటుంబ సభ్యులు వెతికినా.. ఎలాంటి ఫలితం లభించలేదు. కావ్య కొంతకాలంగా అను అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు తల్లి పార్వతి తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్‌పై బాలికలకు అవగాహన


కేఆర్‌ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో బ్యానర్లు ప్రదర్శిస్తున్న కిశోర బాలికలు

మద్దిలపాలెం: బాలల హక్కులు, విద్య, ఓపెన్ స్కూల్‌పై కిశోర బాలికలు అవగాహన కలిగి ఉండాలని కేఆర్‌ఎం కాలనీ–1 అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి సూచించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శనివారం సీడీపీవో ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో తమ అంగన్‌వాడీ కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. కిశోర బాలికలకు విద్య, ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించినట్లు చెప్పారు. బాలికల సందేహాలను తెలుసుకుని నివృత్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మొల్లి అప్పారావుకు అభినందనల వెల్లువ


వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావును సత్కరిస్తున్న ఐ.హెచ్.ఫరూకీ



మొల్లి అప్పారావును సత్కరిస్తున్న పార్టీ మహిళా నాయకులు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మొల్లి అప్పారావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు, ఏక్యూజే కాలేజ్ అధినేత ఐ.హెచ్.ఫరూకీ శనివారం మొల్లి అప్పారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు గురుతర బాధ్యత అప్పగించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడి పనిచేస్తానన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఉన్న మైనారిటీ సోదర, సోదరీమణులు పార్టీ పటిష్టతకు కృషి చేసేలా వారితో మమేకమవుతానని చెప్పారు. అప్పారావును కలిసిన వారిలో విశాఖ జిల్లా ఎంప్లాయిస్ – పెన్షనర్స్ అధ్యక్షులు దేవరకొండ మార్కండేయులు(ఇబ్రహీం), పీతల గోవింద్, ఎం.డి మక్బూల్, జహంగీర్, షకీనా, మహమద్ ఫిరోజ్, గౌషి, అజీజ్, ఎస్.కె.బాషా, నిజాముద్దీన్, బాజీ, బాబుజీ, మదర్స, జాకీర్, బాషా, అలీ, అబ్బాస్, అమన్‌లు ఉన్నారు.

తూర్పు సమన్వయకర్తకు సత్కారం

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావును పార్టీ మహిళా నాయకులు సత్కరించారు. పలువురు మహిళా నాయకులు శనివారం ఆయనను నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మొల్లి నాయకత్వంలో తూర్పు నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన మార్గనిర్దేశంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. విశాఖ జిల్లా మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ పిల్లా సత్యవతి, 17వ వార్డు మహిళా నాయకులు మమత, సుధా, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై పోలీసులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్ జట్టి

ఎంవీపీకాలనీ: పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి సూచించారు. ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రిలో శనివారం పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రోజువారి విధుల ఒత్తిడిలో పోలీసులు ఆరోగ్య సమస్యలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాలతో కూడిన మితాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం , ఒత్తిడిని తగ్గించుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ దిశగా వారి కుటుంబ సభ్యులు సైతం సహకారం అందించాలన్నారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మెడికవర్ హాస్పిటల్ సహకారంతో సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 750 మంది ఈ సేవలను వినియోగించుకున్నారన్నారు. గుండె, కిడ్నీ, మామోగ్రఫీ తదితర 13 రకాల పరీక్షలు మెడికవర్ హాస్పిటల్, అచ్యుతాపురానికి చెందిన రుషిల్ డెకర్స్ సహకారంతో ఉచితంగా చేసినట్లు చెప్పారు. మెడికవర్ హాస్పిటల్ సెంట్రల్ హెడ్ డాక్టర్ సిహెచ్.అరుణ్‌కుమార్, రుషిల్ డెకర్స్ వైస్ ప్రెసిడెంట్ ఎ.కె.రాయ్, అదనపు ఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీటీసీ డీఎస్పీ బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


నేడు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌రావు, కరస్పాండెంట్ పి.ఎస్.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 12 ప్రముఖ కంపెనీల్లో 1,840 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ అర్హత గల అభ్యర్థులు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్ కొండవాలులో రక్షణ గోడ నిర్మాణానికి శనివారం కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. పనులు వేగంగా జరిపించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్స్ ఏఈ వెంకటరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: వివిధ కారణాల వల్ల తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం అందించేందుకు విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సిద్ధంగా ఉందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఉదయం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ సమావేశ మందిరంలో తప్పిపోయిన బాలల దినోత్సవం నిర్వహించారు. నగర పోలీసు విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమాంతర న్యాయ సేవా సహాయకులు, ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సన్యాసినాయుడు మాట్లాడుతూ తప్పిపోయిన బాలలకు పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, లోక్ అదాలత్ ఉచితంగా సేవలందిస్తాయన్నారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని తమ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ మేజిస్ట్రేట్ 1 రామచంద్రరావు, ఏసీపీ (క్రైం) డి.లక్ష్మణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట


బీటీఆర్ నగర్‌లోని ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖ స్థలం ఆక్రమణకు అధికారులు అడ్డుకట్ట వేశారు. 12వ వార్డు బీటీఆర్ నగర్‌ను ఆనుకొని అటు తోటగరువు, పెదగదిలి వరకు సర్వే నంబర్ 56లో పశు సంవర్ధక శాఖకు చెందిన భూమి ఖాళీగా ఉంది. అందులో బీటీఆర్ నగర్‌ను ఆనుకుని ఉన్న కొంత స్థలాన్ని(సుమారు 400 చదరపు గజాలకు పైగా) రెండు రోజుల కిందట కొందరు ఆక్రమించారు. దానిలో తాటి తదితర చెట్లను నేలకూల్చి, పొక్లెయిన్‌తో చదును చేయించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ అధికారులు శనివారం ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్(జేడీ) డాక్టర్ ఎస్.కరుణాకరరావు, డీడీ డాక్టర్ నీలయ్య, వైద్యుడు అశోక్, సిబ్బందితో వెళ్లి ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో సిబ్బందితో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించి తాత్కాలికంగా కర్రలతో కంచె వేయించారు.

భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

కొద్ది నెలలుగా కొందరు ఇక్కడ పశు సంవర్ధక శాఖ భూముల ఆక్రమణకు పాల్పడుతూ తలనొప్పిగా మారుతున్నారని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా జేడీ డాక్టర్ కరుణాకరరావు మాట్లాడుతూ డెయిరీ ఫారానికి సంబంధించి భూములను ఎవరు ఆక్రమించినా క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతోపాటు తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయం పక్కన ఖాళీ స్థలాన్ని ఆనుకొని ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించేయాలని నిర్వాహకులకు ఆదేశించామన్నారు. లేదంటే పోలీసుల సహకారంతో వాటిని తొలగించేస్తామని హెచ్చరించారు. దీనిపై ఆరిలోవ సీఐకి కూడా బందోబస్తు కోసం సంప్రదించినట్లు జేడీ తెలిపారు.